క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.9లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి దేవస్థానంలో నిత్యాన్న దాన పథకానికి గురువారం రూ.9లక్షల విరాళం అందింది. తిరుపతికి చెందిన అనంత కోటిరాజు, బాలసరస్వతిల వివాహ దినం పురస్కరించుకుని వారి కుమారులు ఈ విరాళాన్ని ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుబ్బారెడ్డి, ప్రశాంత్, సుదర్శన్‌రెడ్డి, మహేష్, పట్టణ ప్రముఖులు పసల కుమారస్వామి, తేజు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే

సత్యవేడు: మండలంలోని పుదుకుప్పంలో గురువారం నిర్వహించిన మారియమ్మ గంగ జాతరలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని అమ్మవారి దర్శించుకున్నారు. స్థానిక ఎంపీటీసీ శరవణ, జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, సెల్వం, ధనపాల్, గోకుల్, శ్రీధర్ రెడ్డి, పునిదకుమార్, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ



మాట్లాడుతున్న శ్రీకాళహస్తి ఏడీఏ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ ఉప సంచాలకులు సుబ్రమణ్యం అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మట్టి పరీక్ష శిక్షణ వారోత్సవాలలో భాగంగా గురువారం మండలస్థాయిలో భూసార పరీక్షలపై వీఏఏలు, రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతో నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు, ఎరువుల మోతాదు తెలుసుకోవచ్చన్నారు. ప్రతి రైతు మట్టి పరీక్షల గురించి తెలుసుకోవాలని కోరారు. రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ భాస్కరయ్య, ఏఓలు వేణుగోపాల్, సుధ, మండల వ్యవసాయాధికారిణి భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట వద్ద గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు.

తమిళ సంవత్సరాదికి ఏర్పాట్లు

నారాయణవనం: శుక్రవారం తమిళ నూతన సంవత్సరాది పురస్కరించుకుని బైపాస్‌లోని ధూడి వినాయక ఆలయం నుంచి 108 పాల కుండలతో బస్టాండ్ వద్ద వినాయకుని ఆలయం మీదుగా చంపకవల్లి సమేత పరాశురేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. పరాశురేశ్వస్వామి ఆలయంలోని సుబ్రమణ్యస్వామికి పాలాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. రాత్రి సుబ్రమణ్యస్వామి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ



పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు లక్ష్మీపతిరెడ్డి, సుధారాణి

రేణిగుంట: మండలంలోని సూరప్పకశం పంచాయతీ అల్లికేశంలో గురువారం సిపాయి ఫౌండేషన్ ద్వారా తల్లులు, పిల్లలు, ఆటో డ్రైవర్లకు సర్పంచులు లక్ష్మీపతిరెడ్డి, సుధారాణి చేతుల మీదుగా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో సిపాయి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

వెంకటగిరి: ఏపీ హైకోర్టు న్యాయవాది జి వెంకటేశ్వర్లుపై బాలాయపల్లి పోలీసులు దాడి చేసిన ఘటన కు నిరసనగా వెంకటగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విధులు బహిష్కరించినట్లు ఆ అసోసియేషన్ నాయకులు బాబ్జీ, ప్రధాన కార్యదర్శి పి రాం ప్రసాద్ తెలిపారు. వారు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదుల సంరక్షణ చట్టం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏ హేమగాంధీ, సహాయ కార్యదర్శి డి గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనకే జనం మద్దతు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ఇందిరానగర్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: జగనన్న ప్రజారంజక పాలనకే జనం మద్దతు పలుకుతున్నారని, అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా, చేయూత, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న చేదోడు ఇలా మీ జీవితాల్లో సంతోషం, వెలుగులు నింపే మరెన్నో పథకాలు మీ గడప వద్దకు రావాలంటే మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ పద్మప్రియ, సర్పంచ్ వీరభద్రం, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. పంచాయతీలో ఎంపికైన ఓటీఎస్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే పద్మావతిపురంలో తాగునీటి అవసరాలకు ఏర్పాటు చేసిన బోరును ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. రాజీవ్‌నగర్‌లోని మసీదులో వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యేను ముస్లిం మైనారిటీలు సాంప్రదాయ వస్త్రాలతో సత్కరించారు. జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, మండల మాజీ కన్వీనర్ పాల సుబ్రమణ్యం రెడ్డి, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ బందిల సురేష్, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సర్పంచులు దుద్దు వేణు, దీప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

ఇందిరానగర్‌లో పలు వీధులకు సీసీ రోడ్లు వేయాలని, రాజీవ్‌నగర్, పద్మావతిపురం గ్రామాల్లో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్లు లాగాలని కోరారు.

ట్రాన్స్‌కో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

ట్రాన్స్‌కో ఏడీ, వరదయ్యపాళెం ఏఈలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 3నెలల క్రితం వరదయ్యపాళెంలోని గోపాలరావుకాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో వీధిలో చేతి కందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్చాలని ఎమ్మెల్యేకు స్థానికులు విన్నవించారు. వారం రోజుల్లో పరిష్కరించాలని అప్పట్లో ఎమ్మెల్యే ఆదేశించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో వారిపై ఎమ్మెల్యే మండిపడటమే కాకుండా ట్రాన్స్‌కో ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: శుక్రవారం అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని బైపాస్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఆదిమూలం పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సారకాయలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు ప్రస్తావించే సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. అందరి సమన్వయంతో మండల ప్రగతికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. ఎక్కడ ఏ సమస్య తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. పలువురు సర్పంచులు విద్యుత్ సమస్యలపై ఏఈ శివప్రసాద్‌ను నిలదీశారు. నిపై స్పందించిన ఎమ్మెల్యే మండలవ్యాప్తంగా నెలకొన్న విద్యుత్ సమస్యలు, వాటికి అవసరమైన స్తంభాలు, వైర్ల వివరాలను తన దృష్టికి తెస్తే తక్షణమే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో ఛైర్మన్ హరిబాబురెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్ గౌరిశంకరరావు పాల్గొన్నారు.

పాపానాయుడుపేటలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో సర్పంచ్ లలిత

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో గురువారం సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 160 మంది రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అభిజ్ఞ, హరిణి, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకుడు కరుణాకరన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): స్థానిక బంగారమ్మగుడి సమీపంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రాస్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం తెలిపారు. ఈ శిబిరంలో గర్భసంచి, రొమ్ము, నోటి కాన్సర్‌పై స్క్రీనింగ్ పరీక్షలు, బీపీ, షుగర్, హెపటైటిస్ పరీక్షలు చేస్తారని చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 30 నుంచి 60 ఏళ్ల లోపు గల మహిళలు, పురుషులు ఈ అవగాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనులు సకాలంలో చేయకుంటే చర్యలు



రేణిగుంట: కరకంబాడిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): ఉపాధి హామీ పనులలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. గురువారం మండలంలోని తొట్టంబేడు పంచాయతీలోని జీవనోపాధి వనరుల శిక్షణా కేంద్రం(సిఎల్ఆర్‌సీ)లో శ్రీకాళహస్తి డివిజన్ కేంద్రంతోపాటు తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రి, సత్యవేడు, వరదయ్యపాళెం, కేవీబీపురం, వెంకటగిరికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వందరోజుల పని కల్పించాలని ఆదేశించారు. ప్రతి పని దగ్గర వర్క్ సైట్ బోర్డులు ఏర్పాటు చేయాలని, పనుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీడీలు ప్రేమ కుమార్, స్వామి దాసు, అన్ని మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బంది, ఏపీఓ సుజాత పాల్గొన్నారు.

ప్రతిజాబ్ కార్డుదారుడు 100రోజులు పని చేయాలి

రేణిగుంట: ప్రతి జాబ్ కార్డుదారుడు 100రోజులకు తక్కువ కాకుండా పని చేసి ఉపాధిని పొందాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. మండలంలోని కరకంబాడిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పేదలకు ఈ పథకం జీవనోపాధిగా మారి ఆర్థిక చేయూతనిస్తోందని ఆయన పేర్కొన్నారు. మండలంలో ఈ పథకం ద్వారా పనులు నాణ్యతతో జరుగుతున్నాయని ఏపీవో జ్యోతిశ్రీని అభినందించారు. ఈ ఏడాది కూడా మరింత ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు.

వేసవిలో విరివిగా 'ఉపాధి' పనులు

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేసవిలో కూలీలకు విరివిగా పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. గురువారం మండలంలోని బండారుపల్లె, కోబాక గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, కూలీల హాజరు ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలపై ఆరా తీశారు. రోజుకు రూ.272 కూలి మాత్రమే వస్తోందని వారు చెప్పడంతో ఆయన పైవిధంగా స్పందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. ప్రతి రోజూ ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కూలీల మస్టరును పంపాలన్నారు. కార్యక్రమంలో ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు రవీంద్రుడు, క్షేత్ర సహాయకులు వెంకటేష్, అమ్ములు, కూలీలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: స్థానిక జయరావువీధికి చెందిన మహమద్ అలీ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. వారిది పేద కుటుంబం కావడంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రియాజ్, పఠాన్ ఫరీద్‌ఖాన్, శంకర్, హమీద్, బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అష్టమి పూజలు



కాలభైరవ క్షేత్రంలో నేతి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- మొక్కులు చెల్లించిన భక్తులు
- పోటెత్తిన తమిళనాడు భక్తులు, మధ్యాహ్నం అన్నదానం

పిచ్చాటూరు: మండలంలో రామగిరిలోని శ్రీ సంతాన కాలభైరవ స్వామి ఆలయంలో గురువారం అష్టమి పూజలు భక్తిప్రపత్తులతో చేశారు. ఉదయం ఆలయంలోని కాళభైరవ స్వామి, శ్రీ వాలీశ్వర స్వామి, శ్రీ మరగదాంబిగ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, విశేష అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అర్చకులు ఆశీర్వచనం పలికారు. పల్లవుల కాలంనాటి ఆలయం కావడం, సంతాన కాలభైరవునిగా ఇక్కడ స్వామివారు భాసిల్లుతుండడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ సురేష్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

కుట్ర పూరితంగానే అవాస్తవ ఆరోపణలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి సత్యవేడు నియోజకవర్గంలో నిత్యం ప్రజలతో మమేకమవుతున్నానని, స్వార్థ రాజకీయాలు తనకు తెలియవని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. అందరి సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తుంటే, ఉద్దేశపూర్వకంగా తనకు, తన పార్టీ శ్రేణుల నడుమ చిచ్చు పెట్టే విధంగా సత్యవేడు మహా టీవీ న్యూస్ విలేకరి బి.వెంకటేష్ అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను ఖండిస్తూ ఎమ్మెల్యే గురువారం వరదయ్యపాళెంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నేర చరిత్ర కలిగిన వెంకటేష్‌ను విలేకరిగా ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. ఇతనిపై ఎర్రచందనం కేసులో ఏ-1 నిందితుడిగా ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో కేసు ఉందని, ఓ యువతిని మోసం చేసిన కేసులో సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదై, జైలుకు వెళ్లి, బెయిల్‌పై వచ్చాడని పేర్కొన్నారు. నేర చరిత్ర కలిగిన ఇతను చేస్తున్న కుట్రపూరిత ఆరోపణలపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వాస్తవాలను మహా టీవీ యాజమాన్యానికి, జిల్లా కలెక్టర్‌కు, ప్రెస్ అకాడమీకి ఫిర్యాదు చేస్తానని తెలిపా రు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీ నర్ నాయుడు దయాకర్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, చిన్నా, హరిబాబురెడ్డి, బందిల సురేష్, తిలక్‌బాబు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో బస్ షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు



బస్ షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి చొరవతో పీవీకండ్రిగ గ్రామంలో బస్ షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని పీఆర్ ఏఈ నాగరాజు తెలిపారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఎంపీకి సర్పంచ్ కోటమ్మ, మండల వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌పాల్, ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, గ్రామస్తులు నివేదించారు. దీనిపై స్పందించిన ఆయన రూ.5 లక్షల ఎంపీ నిధులను మంజూరు చేశారు. గురువారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అలివేలమ్మ బస్ షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసి కొలతలు వేశారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి

నారాయణవనం: బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత(ఓడీఎఫ్) పంచాయతీలుగా గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరిగా నిర్మించుకోవాలని ఈఓపీఆర్‌డీ డాక్టర్ వేణయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం ఓడీఎఫ్ బృంద సభ్యులు రవి, సాల్మన్‌తో కలిసి మండలంలోని సముదాయం, భీమునిచెరువు, డీకే పాళ్యం పంచాయతీలలో ఆయన పర్యటించారు. ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో సమావేశాలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లను, వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు పంచాయతీలలో ఇంటింటా సర్వే చేస్తున్నామని, వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారిలో చైతన్యం తీసుకువచ్చి, నిర్మించుకునేలా గ్రామ పంచాయతీ పాలక వర్గం, కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. పంచాయతీల ఆర్థిక వనరులను పెంచుకోవడంలో భాగంగా తడి, పొడి చెత్తలను సేకరించి వర్మీకంపోస్ట్ ఎరువుల అమ్మకాలను పెంచుకోవాలని సూచించారు.

వామపక్షాల ప్రజాభేరిని జయప్రదం చేయండి

రేణిగుంట: దేశ ప్రధాని నరేంద్రమోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ఈనెల 14 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు పిలుపునిచ్చిన ప్రజాభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్ కోరారు. రేణిగుంట సీపీఎం కార్యాలయంలో గురువారం వామపక్షాల నాయకులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ పెత్తందార్ల పాలనతో ప్రజలు తీవ్రంగా విసిగిపోయారన్నారు. మోదీని గద్దె దించడమే లక్ష్యంగా వామపక్షాల పోరు సాగుతుందని, ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. మండలంలో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం గ్రామాల్లో విస్తృతంగా చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరమణ, నరసింహారెడ్డి, సెల్వరాజ్, కుప్పస్వామి, బాలకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి తులసీరాజన్, చలపతి, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల జీవితాల్లో ఆర్థిక వికాసం

- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



రేణిగుంటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సభ్యుడు సిపాయి సుబ్రమణ్యం



శ్రీకాళహస్తి: హౌసింగ్‌బోర్డు కాలనీలో..

రేణిగుంట: జగనన్న పాలనలోనే నిరుపేదల ఆర్థిక, సామాజిక వికాసం పెంపొందిందని ఎమ్మెల్సీ సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. స్థానిక జ్యోతినగర్, పత్నీకులంలో గురువారం రాత్రి ఆయన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. సీఎం పాలనపై ప్రజల్లో ఉన్న సంతృప్తస్థాయిని తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? అని ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేదల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసి వారి ఆర్థిక స్థితిగతులను మారుస్తుండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తోనే రాష్ట్రం, బియ్యపు మధుసూదన్‌రెడ్డితోనే శ్రీకాళహస్తి అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ సంఘం అధ్యక్షులు, వార్డు ఇన్‌చార్జ్ ఆర్కాడ్ శంకర్ అన్నారు. గురువారం స్థానిక 34వ వార్డు బీపీ అగ్రహారంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ఆయా కుటుంబాలకు వారికి వివరించారు. అనంతరం వారి మొబైల్ ఫోన్లో 82960 82960 మిస్డ్ కాల్ ఇచ్చారు. సచివాలయ కన్వీనర్లు నాగేంద్ర రెడ్డి , కవిత రెడ్డి ,గృహ సారథులు మోహన్, బాబు, ముని రామయ్య, మహేష్, వలంటీర్లు జ్ఞాన ప్రసాద్,చంద్ర, శివ పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో..

పట్టణంలోని 28, 29వ వార్డులో జగనన్నతోనే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వార్డు ఇన్‌చార్జి హౌసింగ్ బోర్డు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 29 వార్డు ఇన్‌చార్జి దామోదరం రెడ్డి, గృహసారథులు కుమార్, బాలాజి, మునీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

నారాయణవనం మండలంలో..

నారాయణవనం: 'జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్'ను పార్టీ శ్రేణులు యజ్ఞంగా నిర్వహిస్తున్నాయని జేసీఎస్ చైర్మన్ కోనేటి బాబు తెలిపారు. 19 పంచాయతీలలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రతిష్ఠాత్మకంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్నారని చెప్పారు.

చెన్నంపల్లెలో..

ఏర్పేడు: మండలంలోని చెన్నంపల్లెలో సర్పంచ్ తిరుమల లక్ష్మి, రమేష్, మేర్లపాకలో సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.







శ్రీకాళహస్తి: బి.పి.అగ్రహారంలో.., నారాయణవనం : డీకే పాళ్యంలో సర్వే నిర్వహిస్తున్న సర్పంచ్ స్వర్ణ తదితరులు, ఏర్పేడు : చెన్నంపల్లెలో..